క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

సింహాద్రిపురం : మండల పరిధిలోని రావులకొలను గ్రామంలో బుధవారం మారెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామ సుభిక్షం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి పలు బృందాలచే చెక్కభజన కార్యక్రమం నిర్వహించారు. వచ్చే ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించనున్నారు.

ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

కమలాపురం : మండలంలోని రామాపురంలో వెలసిన శ్రీ మహాలక్ష్మి సమేత మోక్ష నారాయణస్వామి, శ్రీవల్లీదేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామి వార్ల బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమైయ్యాయి. మొదటి రోజు ఉదయం తదితర పూజాదికార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం మోక్ష నారాయణ స్వామిని హనుమద్వాహనంపై, సుబ్రమణ్య స్వామిని వృషభ వాహనంపై ఊరేగించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వేళాంగిణికి బస్సు సౌకర్యం

జమ్మలమడుగు : జమ్మలమడుగు డిపో నుంచి తమిళనాడులోని వేళాంగిణి, నాగపట్నంకు బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు డిపో అసిస్టెంట్ మేనేజర్ పెద్దిరాజు తెలిపారు. బుధవారం స్థానిక డిపోలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 12తేదీ సాయంత్రం నాలుగు గంటలకు జమ్మలమడుగు నుంచి బస్సు బయలుదేరి మరుసటి రోజు ఉదయం ఆరుగంటలకు, నాగూరు, వేళాంగిణి చేరుకుంటుందన్నారు. తిరిగి 13వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు వేళాంగిణి నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం ఐదు గంటలకు జమ్మలమడుగుకు చేరుకుంటుందన్నారు. టిక్కెట్ ధర ఒక్కొక్కరికి రూ.2,630 ఉంటుందన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వీరపునాయునిపల్లె : మండల ప్రజా పరిషత్ కార్యాలయ సభా భవనంలో గురువారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, పలువురు ప్రజా ప్రనిధులు హాజరవుతారని అన్ని శాఖల మండలస్థాయి అధికారులు పూర్తిస్థాయి నివేధికలతో హాజరుకావాలని ఆయన కోరారు.

కలమల్ల ఎస్ఐగా సంజీవరెడ్డి బాధ్యతల స్వీకరణ



ఎర్రగుంట్ల : మండల పరిధిలోని కలమల్ల ఎస్ఐగా సంజీవరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రొద్దుటూరు రూరల్ ఎస్ఐగా పనిచేస్తున్న సంజీవరెడ్డి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ శివప్రసాద్ ప్రొద్దుటూరు రూరల్‌కు బదిలీ అయ్యారు.

ఆర్టీపీపీ-ప్రొద్దుటూరు రోడ్డును బాగు చేయండి



ఆర్టీపీపీ సీఈ మురళీకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని ఆర్టీపీపీ-ప్రొద్దుటూరుల మధ్య అధ్వానంగా ఉన్న రోడ్డును బాగుచేయాలని కోరుతూ బుధవారం ఆర్టీపీపీ సీఈ మురళీకృష్ణకు ఏపీ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ నేతలు వినతిపత్రం అందించారు. ప్రతి రోజు డ్యూటీ నిమిత్తం ప్రొద్దుటూరుకు తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది ఉద్యోగులు కార్మికులు ప్రయాణించాల్సి ఉందన్నారు. తర్వగా మరమ్మతులు చేపట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుబ్బిరెడ్డి. గిరిబాబు, శేఖర్, హామీద్, శ్రీనివాసరెడ్డిలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మాక్ పాలీసెట్ పరీక్షలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత (మెయిన్) పాఠశాలలో బుధవారం స్నేహిత అమృతహస్తం సేవా సమితి ఆధ్వర్యంలో మాక్ పాలీసెట్ పరీక్ష నిర్వహించారు. మూడు రోజులుగా ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం సహకారంతో పాలీసెట్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మాక్ పాలీసెట్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ ఈ మాక్ పాలీసెట్ పరీక్షలకు పులివెందుల ప్రాంతంనుంచే కాక, అన్నమయ్య, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల నుంచి 260 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఈ పరీక్షలు రాయడంవల్ల పాలీసెట్ ప్రవేశ పరీక్షలకు అవగాహన కలిగి ఉండటంతోపాటు ప్రవేశ పరీక్షలో ఉత్తమ ర్యాంక్‌లు సాధించడానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయం

ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటిని పరిష్కరించడమే ప్రధాన ధ్యేయంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కోట్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని కోట్లూరు, బాకరాపురం, బీచువారిపల్లె గ్రామాల్లో బుధవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చింతకొమ్మదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులురెడ్డితో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగి ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. అర్హత వుండి ఏవైనా పథకాలు అందకుంటే తెలపండి వాటిని పరిష్కరిస్తామని ఆయన ప్రజలకు భరోసా ఇచ్చారు. కోట్లూరు, బీచువారిపల్లె ఎస్సీ కాలనీ, బాకరాపురం గ్రామాలలో సీసీ రోడ్లు వేయాలని ప్రజలు కోరగా వాటిని మంజూరు చేస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేతలు నాగిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, మస్తాన్, అంకిరెడ్డి, పుల్లయ్య, ఏసు, ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, ఎంపీడీఓ జుబేద, తహసీల్దార్ అమరేశ్వరి, ఈఓ పీఆర్‌డీ ప్రసాద్, ఎంఈఓ లిల్లెమ్మ, ఏఓ సాయిశైలజ, ఏఈలు ప్రతాప్‌రెడ్డి, పవన్, ముజీబ్, డానియల్ జోసెఫ్, ఏపీఎం శైలజ, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

చింతకొమ్మదిన్నె : మండలంలోని అప్పరాజుపల్లె గ్రామంలో బుధవారం చౌడేశ్వరిదేవి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు వేణుగోపాల్, రఘునాథరెడ్డి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను అరికట్టాలి



మాట్లాడుతున్న అర్బన్‌డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ నందన్

జమ్మలమడుగు రూరల్ : మండలపరిధిలో అధికారుల అనుమతులు తీసుకోకుండా అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలపై అధికారులు దృష్టి సారించాలని అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ వై.ఓ.నందన్ తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మైలవరం, పెద్దముడియం మండలాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఆయన సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శుల పరిధిలోని అయా సచివాలయాల్లోని పరిధిలో భవన నిర్మాణాలు, లేఅవుట్‌లకు అధికారుల అనుమతులు తీసుకోకుండా నిర్మించడం వల్ల పంచాయతీకి రావలసిన ఆదాయానికి గండి పడుతున్నదని ఆయన తెలిపారు. భవనాలు నిర్మిస్తున్నప్పుడు తప్పనిసరిగా అప్రూవల్ తీసుకొనేవిధంగా చూడలన్నారు. అలా తీసుకోని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. 300 చ.మీ. వరకు పంచాయతీ కార్యదర్శులతో ఆపైన భవన నిర్మాణాలు, లేఅవుట్లకు అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వారితో అనుమతులు పొందాలన్నారు. ఇందులో ఏ మాత్రం అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి టి.కృష్ణసింగ్, డీఎల్పీఓ విజయ్‌కుమార్ ఎంపీడీఓ అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి లక్ష్మినరసింహ స్వామి ఉత్సవాలు

పెండ్లిమర్రి : మండలంలోని పాతసంగటిపల్లె గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మినరసింహస్వామి వార్షికోత్సవ ఉత్సవాలు గురువారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త చెన్నారెడ్డి, ఈఓ మహేశ్వర్‌రెడ్డిలు తెలిపారు. గురువారం లక్ష్మినరసింహాస్వామి జయంతి, రాత్రికి ఊంజల్ సేవ, శుక్రవారం స్వామి వారికి అభిషేకం, రాత్రికి గరుడ సేవ, శనివారం లక్ష్మినరసింహ స్వామి కల్యాణం వంటి కార్యక్రమాలు వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే బండలాగుడు పోటీలను శుక్రవారం ఓల్డ్ క్యాటగిరి ఎద్దులచే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.50వేలు, రెండవది రూ.40వేలు, మూడవది రూ.30వేలు, నాల్గవది రూ.25వేలు, ఐదవది రూ.20వేలు, ఆరవది రూ.15వేలు అందజేస్తామన్నారు.

రేపు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో (రేపు) శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 08568286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

సీఐ, ఎస్ఐలపై చర్యలు తీసుకోవాలి

కమలాపురం : గత నెల 30వ తేదీన కడప ఐటీఐ సర్కిల్ వద్ద సీపీఐ సీపీఎం చేపట్టిన ప్రచార భేరిని అడ్డుకుని సీపీఐ నాయకుడు, న్యాయవాది సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్రమణ్యంను అదుపులోకి తీసుకుని చితకబాదిన కడప తాలూకా సీఐ ఉలసయ్యను, ఎస్ఐలు రామకృష్ణ, తాహిర్‌లపై చర్యలు తీసుకునే వరకు ఉద్యమం ఆగదని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య, డీడీకేఎస్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పల్లా వరప్రసాద్‌లు బుధవారం కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. ఈ అంశంపై మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తున్నట్లు వారు తెలిపారు.

ఉద్యోగ బాధ్యత ప్రభుత్వం తీసుకోవడం హర్షణీయం



విద్యార్థికి నియామక పత్రం అందిస్తున్న తహసీల్దార్ నారాయణరెడ్డి

కమలాపురం : విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు ఉద్యోగ బాధ్యత కూడా ప్రభుత్వమే తీసుకోవడం హర్షణీయం అని మండల తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చివరి సంవత్సరం విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జాబ్ మేళా (ప్లేస్‌మెంట్) నిర్వహించి ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు ఆయన నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను తీర్చిదిద్దిందన్నారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లను నిర్వహించి, స్థానిక పరిశ్రమలకు అనుసంధానం చేసి పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో అనేక మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మార్పురి మేరీ, 4వ వార్డు కౌన్సిలర్ నిఖిల్‌రెడ్డి, కళాశాల సీనియర్ లెక్చరర్ రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్లు మంజూరు

వీరపునాయునిపల్లె : కమలాపురం నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ మినిరల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ సౌజన్యంతో 25 మినిరల్ వాటర్ ప్లాంట్లు మంజూరైనట్లు రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ లింగారెడ్డి వీరప్రతాప్‌రెడ్డి తెలిపారు. బుధవారం వీరపునాయునిపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్లాంట్ల మంజూరులో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి కృషి మరువలేనిదన్నారు. 5 ప్లాంట్లు ప్రారంభించామని, 11 ప్లాంట్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని, మరో 9 ప్లాంట్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. అలాగే మరో 20 ప్లాంట్ల మంజూరుకు ప్రతిపాధనలు పంపించామన్నారు. ఒక్కో ప్లాంటు రూ.6.5 లక్షలతో నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు నరేష్‌రెడ్డి, కమలాపురం మార్కెట్‌యార్డ్ మాజీ వైస్ చైర్మన్ గంగిరెడ్డి, యరమలపల్లె సర్పంచ్ సౌజన్యరెడ్డి, కమలాపురం మండలం వైసీపీ నాయకుడు వంశీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బోగాదమ్మ తిరునాల



ప్రత్యేక అలంకరణలో బోగాదమ్మ

వీరపునాయునిపల్లె : మండలంలోని అనిమెల గ్రామ సమీపంలోని కోరుకొండపై వెలసిన బోగాదమ్మ తిరునాల బుధవారం రాత్రి బియ్యం కొలతతో ప్రారంభమైంది. ఈ తిరునాల నాలుగు రోజులపాటు కొనసాగనుంది. గురువారం అమ్మవారికి కుంభబలి, రాత్రి 8 గంటలకు పొంగుపాలు, శుక్రవారం ఉదయం 9 గంటలకు అమ్మవారు భక్తులకు దర్శనం, సాయంత్రం 3 గంటలకు గ్రామంలోని రైతులు వృషభ రాజములచే అమ్మవారి గుడి చుట్టూ శిరిమాను ఉత్సవం, రాత్రి 9 గంటలకు నెల్లూరు సరస్వతీ నాట్యమండలి వారిచే పౌరాణిక నాటకం, శనివారం మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 3గంటలకు పొరుగు గ్రామాలకు చెందిన రైతులు వృషభ రాజములచే అమ్మవారి గుడి చుట్టూ శిరిమాను ఉత్సవం, రాత్రి 9 గంటలకు పాటకచేరి, ఆదివారం ఉదయం అమ్మవారు పాలేటికి తరలుతుందన్నారు.

ప్రారంభమైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మిషన్లు

వేంపల్లె : పట్టణంలోని వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సులకు అడ్మిషన్ల పక్రియ ప్రారంభమైందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు తెలిపారు. బుధవారం ఆయన తెలుపుతూ సైన్స్ విభాగంలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ ఎమ్మెస్సీ, బీఎస్సీ బీజెడ్సీ, అలాగే ఆర్ట్స్ విభాగంలో బీకాం కంప్యూటర్ అప్లికేషన్, బీఏ హెచ్‌ఈసీ, హెచ్‌పీ స్పెషల్ ఇంగ్లీషు గ్రూపులు కలవన్నారు. ఈ అవకాశాన్ని ఇంటర్ ఉత్తీర్ణత సాధించి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అడ్మిషన్లు పొందే విద్యార్థి సంబంధిత సర్టిఫికెట్, జిరాక్స్ కాపీలను వెంట తీసుకరావాలని కోరారు. ఇతర వివరాలకు 9491927599, 6281129818 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

వైభవంగా ధ్వజారోహణం..



ధ్వజ స్తంభానికి పూజలు చేస్తున్న వేదపండితులు

పెండ్లిమర్రి : మండలంలోని చిన్నదాసరిపల్లె గ్రామ సమీపంలోని వెయ్యినూతలకోన పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీలక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ధ్వజారోహణం కార్యాక్రమాన్ని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.నరసింహహరిప్రసాద్ ప్రారంభించారు. వేదపండితుల ఆధ్వర్యంలో యాగశాల ప్రవేశం, శాంతి హోమం, రాత్రి శేషవాహన సేవ వంటి కార్యాక్రమాలు వైభవంగా నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యాలో తరలివచ్చి మొక్కులు తీర్చుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నేడు నరసింహస్వామి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు ధ్వజారోహణం..

జమ్మలమడుగు : నారాపురస్వామి బ్రహోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం 8:45 నిమిషాల నుంచి 9:45 మధ్యలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నారాపుర స్వామి ఆలయ అధికారులు తెలిపారు. సాయంత్రం పెద్దశేష వాహనంపై గ్రామోత్సవాన్ని నిర్వహించడంతోపాటు భక్తులకు హరికథ కాలక్షేపం ఉంటుందన్నారు. బుధవారం రాత్రి స్వామి వారిని సేవాధిపతి ఉత్సవ అంకురార్పణలో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తాతిరెడ్డితులసి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డిలు పాల్గొన్నారు.

8న ఆలయ వార్షికోత్సవం

పులివెందుల రూరల్ : ఈనెల 8వ తేదీన పులివెందుల మండలం అచ్చివెల్లి గ్రామ సమీపంలో వెలసిన అచ్చివెల్లి గంగమ్మ ఆలయ వార్షికోత్సవంను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజలతో పాటు చెక్కభజనలు, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు టిప్పు సుల్తాన్ వర్ధంతి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నేడు మైసూర్ పులి టిప్పు సుల్తాన్ వర్ధంతి సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ భాష పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఆప్‌కీ ఆవాజ్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు.

సమష్టి కృషితో నడిపించండి



మాట్లాడుతున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పట్టణంలోని వంద పడకల ప్రభుత్వాసుపత్రిని సమష్టి కృషితో అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత మనపై ఉందని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో ప్రభుత్వాసుపత్రులలో ఉన్న వైద్యుల కొరతను భర్తీ చేశారన్నారు. సదరం క్యాంపు కూడా ఇందులోనే నిర్వహించే విధంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఐ బ్యాంక్ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు స్నేహభావంతో మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆసుపత్రిలో గతంలో కంటే ఇప్పుడు రోగుల సంఖ్య పెరిగిందని తన దృష్టికి వచ్చిందన్నారు. డిసెంబర్ నాటికి మెడికల్ కళాశాల నిర్మాణాలు పూర్తయి ప్రారంభమవుతుందని.. అప్పటిలోగా ఆసుపత్రిని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డేవిడ్ సెల్వన్ రాజ్, వైద్యులు నవీన్‌కుమార్, ఆసుపత్రి కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట వేడుకలు



ఆలయంలో కొలువుదీరిన సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వాముల వారు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్ అభిషేక్‌రెడ్డి

లింగాల : దిగువలింగాల గ్రామంలో బుధవారం నూతనంగా నిర్మించిన శ్రీకోదండ రామస్వామి ఆలయంలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ట ధ్వజ స్తంభారోహణ అనంతరం సీతారాముల కల్యాణాన్ని పురోహితులు సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం బండలాగుడు పోటీలను వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగపు రాష్ట్ర కార్యదర్శి వైఎస్ అభిషేక్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలలో తెలంగాణా రాష్ట్రం రంగారెడ్డి జిల్లా బాలాపూర్‌కు చెందిన పి.ప్రసన్నారెడ్డి ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచి రూ.80వేల నగదుతోపాటు సారెడ్డి చంద్రశేఖరరెడ్డి రూ.10వేలు, అలవలపాటి రామచంద్రారెడ్డి రూ.5వేల నగదును అందజేశారు. అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెందిన కె.రామాంజనేయులు ఎద్దులు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.5వేలు, మూడవ బహుమతిని వైఎస్సార్ జిల్లా బాలుగారిపల్లెకు చెందిన ఇ.రమణారెడ్డి ఎద్దులు రూ.35వేలుతోపాటు ఈ పోటీలు గెలుపొందిన వారికి తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీఓ సురేంద్రలు నగదు బహుమతులను అందజేశారు. అలాగే నెల్లూరుకు చెందిన శ్రీసాయి ఈవెంట్స్ వారిచే నిర్వహించిన ఆర్కెస్ట్రా ప్రజలను అలరించింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బాబురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటరీ కన్వీనర్ సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఖాదర్‌ఖాన్ కొట్టాల ఎద్దులు ఫస్ట్



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

వల్లూరు : కోదండ రామాలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన ఆరు పళ్ల విభాగం ఎద్దుల బండలాగుడు పోటీల్లో మొత్తం 13 జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో కడప మండలం ఖాదర్‌ఖాన్‌కొట్టాలుకు చెందిన డి.భావనశ్రీ ఎద్దులు 3410 అడుగులు బండను లాగి మొదటి స్థానంలో, ప్రొద్దుటూరు మండలం నాగాయపల్లెకు చెందిన తవ్వా చంద్రవిజయకుమార్‌రెడ్డి ఎద్దులు 3269 అడుగులు లాగి రెండవ స్థానంలో, మైదుకూరు మండలం సరస్వతిపేటకు చెందిన బొగ్గుల రాజేశ్వరి ఎద్దు, ఖాజీపేట మండలం సుంకేసులకు చెందిన మద్దూరు ఆదిరెడ్డి ఎద్దు కలిసి 3090 అడుగులు లాగి మూడవ స్థానంలో, వీరపునాయునిపల్లె మండలం తలపనూరుకు చెందిన గంగిరెడ్డిగారి గంగిరెడ్డి ఎద్దు, వల్లూరు మండలం చిన్న నాగిరెడ్డిపల్లెకు చెందిన నారంగారి తారక్‌రెడ్డి ఎద్దు కలిసి 3000 అడుగులు లాగి నాలుగవ స్థానంలో, కొండాపురం మండలం బెడుదూరుకు చెందిన వి.శ్రీనివాసులు ఎద్దు, రాజుపాలెం మండలం కూలూరుకు చెందిన సంపత్‌కుమార్ ఎద్దు కలసి 2976 అడుగులు లాగి ఐదవస్థానంలో, వల్లూరు మండలం సీతోరిపల్లెకు చెందిన మల్లికార్జునరెడ్డి ఎద్దులు 2886 అడుగులు లాగి ఆరవ స్థానంలో, నంద్యాల జిల్లా సంజామల మండలం ఆర్.లింగందిన్నెకు చెందిన మేకల సుదర్శన్ ఎద్దులు 2830 అడుగులు లాగి ఏడవ స్థానంలో, వల్లూరు మండలం చెరువుకిందిపల్లెకు చెందిన తుమ్మలూరు విజయ భాస్కర్‌రెడ్డి ఎద్దులు 2772 అడుగులు లాగి ఎనిమిదవ స్థానంలో నిలిచాయి. విజేతలకు దాతల చేతుల మీదుగా నగదు బహుమతులను అందజేశారు. యాంకర్ గంగారు చంద్రమోహన్‌రెడ్డి వ్యాఖ్యానం ఉత్తేజభరితంగా సాగింది.

ఘనంగా రామాలయ వార్షికోత్సవం

స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలు సమీపంలో వెలసిన కోదండరామాలయ దశమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వాముల మూల విరాట్‌లకు అర్చకులు అభిషేకాలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలను నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి వివిధ భజన బృందాల ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలను నిర్వహించారు.

విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

కమలాపురం : విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించే ఆలోచనను విరమించుకోవాలని, 100 శాతం సామర్థ్యంతో ప్రభుత్వమే ప్లాంట్‌ను నడపాలని సీపీఐ ఏరియా కార్యదర్శి పి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా 10 వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాల నేతృత్వంలో తలపెట్టిన రాస్తారోకోలో భాగంగా స్థానిక క్రాస్ రోడ్డువద్ద ఆయన రాస్తారోకో నిర్వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దక్షిణ కొరియాకు చెందిన పోస్కో, అదానీలకు విశాఖ ప్లాంటును 100 శాతం అప్పగించాలన్న కుట్ర పన్నిందన్నారు. దీనికి వ్యతిరేకంగా 800 రోజుల నుంచి ప్లాంట్ వద్ద రిలే నిరాహార దీక్షలు, ఆందోళనలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. గత ఏడాది కూడా రూ.30 కోట్ల టర్నోవర్ సాధించిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ పరం చేసే నిర్ణయం విరమించుకోవాలని లేని పక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : పట్టణంలోని నాలుగురోడ్ల కూడలిలో ఎర్రగుంట్ల సీపీఐ మండల సమితి అధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటు పరం చేయడాన్ని సీపీఐ పూర్తిగా వ్యతిరేకిస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

'స్పందన' ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి



సమస్యలపై అరా తీస్తున్న డీపీఓ ప్రభాకర్‌రెడ్డి

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : స్పందనలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారులు త్వరగా పరిష్కరించాలని జిల్లా పంచాయతీ అధికారి డి.ప్రభాకర్‌రెడ్డి కోరారు. బుధవారం మైలవరం మండలపరిధిలోని దొమ్మరనంద్యాల గ్రామ సచివాలయంలో ఆయన ఎంపీడీఓ, సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. వేసవికాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం సచివాలయ సిబ్బంది రికార్డ్‌ల నిర్వహణ, స్పందనలో వచ్చిన అర్జీలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై.రామచంద్రారెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక విజ్ఞానం ఎంతో అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు

వేంపల్లె : ప్రస్తుత సమాజంలో శాస్త్ర సాంకేతిక విజ్ఞాన ఆవశ్యకత ఎంతో అవసరమని కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక విజ్ఞాన ఆవశ్యకత అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థులకు వైద్య, విద్య, వ్యవసాయ రంగాలు, బ్యాంకింగ్ రంగాలలో శాస్త్ర సాంకేతిక లాభాలను, నష్టాలను వివరించారు. అలాగే శాస్త్ర సాంకేతిక అభివృద్ధి చెందక ముందు, చెందిన తర్వాత మానవ వికాసం ఎలా జరిగిందో వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి ఓబుళరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.